ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో నూతన పద్ధతి



అంబర్‌పేట పోలీస్‌లైన్‌లో పీఎండీటీ నమూనాను పరిశీలిస్తున్న ముషారఫ్ ఫరూఖీ

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆధునీకరించేందుకు టీజీఎస్ పీడీసీఎల్ నూతన విధానానికి శ్రీకారం చుట్టించారు. ఉపముఖ్యమంత్రి సూచనల మేరకు అధికారులు నగరంలోని ట్రాన్స్‌ఫార్మర్ల అమరిక విధానంలో వినూత్న మార్పులు చేశారు. గురువారం అంబర్‌పేట పోలీస్ లైన్‌లో ఏర్పాటు చేసిన పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (పీఎండీటీ) నమూనాను విద్యుత్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల ఈ పద్ధతినే వాడాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ డైరెక్టర్ డా. నరసింహులు, చీఫ్ ఇంజినీర్ మెట్రో ప్రభాకర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కవాడిగూడ: రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారులు, రోడ్లను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు గాంధీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీజీవో టవర్స్ వద్ద గురువారం మధ్యాహ్నం స్పెషల్ డ్రైవ్ చేపట్టామని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయొద్దన్నారు. రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్ చేసి ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

16సిహెచ్‌కె22: చలాన్లు విధిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి

కబ్జా చెర నుంచి కార్మికశాఖ స్థలానికి విముక్తి

చిక్కడపల్లి: గాంధీనగర్‌లో అనసూయ అనే మహిళకు 1966లో కార్మిక శాఖకు సంబంధించిన 350గజాల స్థలాన్ని జవహర్‌నగర్ స్కూల్ నడుపుకోవడానికి లీజుకు ఇచ్చారు. లీజు స్థలంలో పదేళ్లుగా పాఠశాలను నడపకుండా మూసేశారు. ఈ క్రమంలో అనసూయ అనే మహిళ ఆ స్థలాన్ని తమ కుటుంబీకుల పేరుపై 'పవర్ ఆఫ్ అటార్నీ'చేయించుకున్నారు. ఈ స్థలాన్ని మహిళ కుటుంబ సభ్యుల నుంచి గాంధీనగర్‌లోని ఓ నాయకుడు తీసుకుని దానిని వ్యాపార సముదాయాలకు వాడుకుంటున్నారని స్థానికులు కార్మిక శాఖ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు గురువారం కార్మికశాఖ బోర్డును ఏర్పాటు చేశారు. స్థలాన్ని కబ్జా చెర నుంచి కాపాడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ గాంధీనగర్‌లోని కార్మికశాఖ స్థలాన్ని కబ్జా చేయాలని ఎవరైన చూస్తే ఊరుకునేది లేదని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ హెచ్చరించారు.

పూతవ్యాధి ఉందంటూ విద్యార్థిని వెలివేసిన టీచర్లు

కాచిగూడ: చాడీనానామియా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పూత వ్యాధి (బొల్లి)తో బాధపడుతున్న విద్యార్థిని అంటరానివాడిగా అక్కడ పనిచేస్తున్న టీచర్లు వెలివేసిన సంఘటన కలకలం రేపింది. అతడిని ముట్టుకోవద్దని.. అతనితో మాట్లాడవద్దని.. అలా చేస్తే మీకు వ్యాధి అంటుకుంటుందని తోటి విద్యార్థులకు టీచర్లు చెప్పడం వివాదాస్పందంగా మారింది. విద్యార్థులు అతనికి దూరంగా ఉంటుండటంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన ఆ విద్యార్థి తన తల్లికి చెప్పాడు. గురువారం ఆమె పాఠశాలకు వెళ్లి టీచర్లను నిలదీసింది. తన కుమారుడిని మానసిక్షోభకు గురిచేసిన టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లి విద్యాశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది.

పనులను త్వరగా పూర్తి చేయండి

కాచిగూడ: బర్కత్‌పుర సూర్యభగవాన్ దేవాలయం రోడ్డులో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. గురువారం ఆమె సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. డ్రైనేజీ, వాటర్ పైపులైన్లు పగులకుండా రోడ్డు పనులు చేపట్టాలన్నారు. నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, యోగేష్, జ్ఞానేశ్వర్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులు 🥊 అధికారులు

- బోర్డు సమావేశంలో దుమారం
- ఎంపీ, ఎమ్మెల్యే వాకౌట్
- అర్ధంతరంగా సమావేశం వాయిదా



బోర్డు సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో దుమారం రేగింది. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సాగిన మాటల యుద్ధం ఏకంగా సమావేశం రద్దుకు దారితీసింది. బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ నేతృత్వంలో ప్రారంభమైన సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్న అర్విండ్ కుమార్ ద్వివేది, జాయింట్ ఆశిక్, బోర్డు సభ్యురాలు భానుక నర్మదలతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు.

ఆరంభం నుంచే ఎంపీ ఆగ్రహం..

◆ ఎజెండాపై చర్చ ఆరంభానికి ముందు నూతన సీఈఓకు స్వాగతం పలికారు. కంటోన్మెంట్ బోర్డుకు ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించిన రూ.303 కోట్ల పరిహారం సొమ్ము వచ్చిందని అధ్యక్షుడు బోర్డుకు వెల్లడించారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అధికారులు స్థానిక ఎంపీగా తనకు తగిన గౌరవం ఇవ్వలేదంటూ మాట్లాడారు. ముఖ్యంగా డీఈఓ దినేశ్ కుమార్‌రెడ్డి తన ఫోన్‌కు స్పందించడం లేదన్నారు.

◆ రక్షణ స్థలాల్లోని అక్రమ నిర్మాణాల తొలగింపు విషయంలో అధికారులు పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారంటూ పేర్కొన్నారు. వందలాది ఎకరాల బీ–3 స్థలాలను కబ్జా చేసిన ఇంపీరియల్, బాంటియా, మల్లారెడ్డి, కేజేఆర్ తదితర గార్డెన్‌ల వదిలి, ఫుట్‌పాత్‌లపై వెలిసిన చిన్నపాటి దుకాణాలను తొలగించడమేంటని ప్రశ్నించారు.

◆ జేబీఎస్ ఆవరణలో కొన్నేళ్లుగా వీధి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని రోడ్డుపాలు చేయడమేంటన్నారు. దీంతో అధికారులు స్పందిస్తూ త్వరలోనే బీ–3 బంగళాల్లోని అక్రమ నిర్మాణాలకు కూల్చేస్తామన్నారు, ఇంపీరియల్, బాంటియా గార్డెన్‌లకు వెకేషన్ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

◆ పికెట్ ఎరుకల బస్తీలో ఇటీవల ఓ భారీ భవనం కూల్చివేతపై అధికారుల తీరును ఎంపీ తప్పుబట్టారు. సదరు నిర్మాణం అక్రమం అని గుర్తిస్తే, ఆరంభంలోనే నిలిపివేయాలి కదా అంటూ ప్రశ్నించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్నాక కూల్చివేయడం సరికాదన్నారు. ఈ అంశాన్ని తాను ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు.

◆ డీఈఓ పరిధిలోని స్థలాల్లో ఫైర్ క్రాకర్స్ దుకాణాల ఏర్పాటుకు అనుమతులు నిరాకరించడమేంటని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా దుకాణాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో యధావిధిగా ఫైర్ క్రాకర్స్ అమ్మకాలకు అవకాశం ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యే రాకతో వేడెక్కిన సమావేశం

◆ బోర్డు సమావేశం ఆరంభమైన అరగంట తర్వా ఎమ్మెల్యే శ్రీగణేశ్ వచ్చారు. అప్పటికే సర్క్యులర్ ఎజెండాలపై చర్చ సాగుతుండగా, ఎమ్మెల్యే సీరియల్ నెంబర 16లోని సర్క్యులర్ ఎజెండాకు సంబంధించి పూర్తిసమాచారం వెల్లడించాలన్నారు

◆ భవన నిర్మాణాల అనుమతులు, టెండర్లకు సంబంధించి సర్క్యులర్ ఎజెండాల్లో ఏం పొందుపరిచారో తమకు తెలియకుండానే చర్చలో ఎలా పాల్గొంటామని ప్రశ్నించారు.

◆ ఓబీ పాస్ విధానం అమల్లోకి వచ్చాక భవన నిర్మాణ అనుమతులను సర్క్యులర్ ఎజెండాల ద్వారా మంజూరు చేస్తున్నామని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. భవన నిర్మాణ అనుమతుల జారీలో అధ్యక్షుడు, సీఈఓ, బోర్డు సభ్యురాలికి మాత్రమే అధికారం ఉందన్నారు.

◆ ఎంపీ, ఎమ్మెల్యే బోర్డు సమావేశాల్లో ప్రత్యేక ఆహ్వానితులు మాత్రమేనని వారికి ఓటింగ్ హక్కు లేదన్నారు. దీనిపై ఎంపీ, ఎమ్మెల్యే తీవ్ర అభ్యంతరం తెలిపారు.

◆ తాము పాల్గొనే సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బోర్డు అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తూ అనుమతులు జారీ చేయడంపై బాధితులు తమను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు.

◆ గతంలో మార్టిగేజ్ విధానంపై బోర్డు సమావేశం తీర్మానంలో తాను సంపూర్ణ మద్దతు తెలిపినట్లు ఏ విధంగా పేర్కొంటారని శ్రీగణేశ్ ప్రశ్నించారు. కేవలం ప్రత్యేక ఆహ్వానితుడిగా పేర్కొంటూనే, మార్టిగేజ్ విధానంపై తాను మద్దతు ఇచ్చినట్లు పేర్కొనడంలో అధికారులు ద్వంద్వ నీతికి పాల్పడుతున్నారని అన్నారు.

◆ ఏదేమైనా గతంలో మాదిరిగా బోర్డు సమావేశాల్లో తాను కేవలం ప్రేక్షక పాత్రకు పరిమితం కానన్నారు. సంపూర్ణ సమాచారం ఇచ్చి, చర్చలో పాల్గొనే అవకాశం ఇవ్వాల్సిందేనన్నారు. తీర్మానాలపై అధికారం బోర్డుదే అయినప్పటికీ, ఆయా అంశాల్లో చర్చలో ప్రజాప్రతినిధులమైన ఎంపీ, ఎమ్మెల్యే సలహాలు, సూచనలు తీసుకోవాల్సిందేనన్నారు. లేని పక్షంలో తాము సమావేశాలకు హాజరు కావడం వల్ల ప్రయోజనమేంటని నిలదీశారు.

◆ ఈ క్రమంలో సీఈఓ మధుకర్ నాయక్ జోక్యం చేసుకుంటూ మున్సిపల్ సంబంధిత వ్యవహారాల్లో నిర్ణయాధికారం బోర్డుదేనని మరోసారి స్పష్టం చేశారు. ఇందుకు అధ్యక్షుడు బ్రిగేడియర్ సైతం మద్దతు పలికారు.

◆ దీంతో ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు. దీంతో అధికారులు బోర్డు సమావేశాన్ని అర్ధంతరంగా ముగించేశారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు విద్యను అభ్యసించాలని... ఆ లక్ష్యాన్ని చేరుకునే వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డి అన్నారు. గురువారం డా. బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో నిర్వహించిన విద్వాత లా ఫెస్ట్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... న్యాయ విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. న్యాయ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడానికి ఈ ఫెస్ట్ ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. విద్యార్థులు చట్టాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయ అంశాలకు సంబంధించిన 8 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యాసంస్థల కార్యదర్శి జి. వినోద్, ప్రొ. వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ డా. సరోజవివేక్, డా. రాంప్రసాద్, పీవీ రమణకుమార్, సీహెచ్ పంచాక్షరి, ప్రొ. లింబాద్రి, ప్రొ. విష్ణుప్రియ, లా కళాశాల ప్రిన్సిపల్ డా. సృజన తదితరులు పాల్గొన్నారు.


నైపుణ్యాలను పెంచుకోవడమే లక్ష్యంగా సాగాలి



ఈట్యూ మినిట్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సనా ఆఫ్రీన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నైపుణ్యాలను పెంచుకోవడమే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని ఐఐటీ ముంబాయికి చెందిన మెంటర్ సనా ఆఫ్రీన్ అన్నారు. గురువారం ఆరోరా డీగ్రీ, పీజీ కాలేజ్, ఓటీబీఐ, ఐఐటీ ముంబాయి సంయుక్త ఆధ్వర్యంలో ఈట్యూ మినిట్ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా సనా ఆఫ్రీన్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఉద్యోగాలు పొందే వారీగా కూడా ఉద్యోగాలు సృష్టించే వారుగా మారాలని సూచించారు. యువతలో వ్యాపార దృక్పథాన్ని అభివృద్ధి చేయడం దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. అజయ్‌కుమార్, డా. జీడీ రజనీ, సమన్వయకర్త వివాన్ కత్రి, మనోహర్, అవితేజ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శించిన విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ రాజునాయక్

చిక్కడపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ సూచించారు. గురువారం చిక్కడపల్లిలోని ఆంధ్రవిద్యాలయం హైస్కూల్లో స్వచ్ఛంద సంస్థ అప్నా ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనం చేసేందుకు ప్లేట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు ప్లేట్లను అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులతో పాటు గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఫిర్యాదు నుంచి చార్జిషీట్ వరకు ఎలా కేసులు వేస్తారో పోలీసులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో దాతలు వామిశ్రీ మహేంద్రకుమార్, అప్నా సమన్వయకర్త బి.రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణ చేసేవరకు ఉద్యమం ఆగదు

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని బీసీ రిజర్వేసన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేసే వరకు బీసీ ఉద్యమం ఆగదని ఆయన స్పష్టం చేశారు. బీసీ కుల సంఘాలు, మేధావులు, న్యాయవాదులతో కలిసి గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడతూ ప్రజా స్వామ్య దేశంలో బీసీలకు సామాజిక న్యాయం అందని ద్రాక్షగా మారిందన్నారు. రాజ్యాంగం స్పష్టంగా చెప్పిన సమాన అవకాశాలు, సామాన వాటా, సమాన భాగస్వామ్యం బీసీలకు ఇప్పటికీ అమలులోకి రాలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం మెడలు వంచి రాజ్యాంగ సవరణ చేసి, బీసీ రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చే వరకు ఈ యుద్ధభేరి ఆగదని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా బీసీల ఆత్మగౌరవ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, హక్కుల సాధనలో భాగంగా జాతీయ రాహదారులను దిగ్బంధం చేసే స్థాయిలో ఆందోళనలు రానున్న రోజుల్లో చేపడతామని ఆయన తెలిపారు. ఇది కేవలం రిజర్వేషన్ల పోరాటం కాదని, ఆత్మగౌరవ ఉద్యమమని అన్నారు.

రైల్లో బంగారు ఆభరణాల బ్యాగు చోరీ



కాచిగూడ: రైల్లో ఓ ప్రయాణికుడి బంగారు ఆభరణాల బ్యాగు చోరికి గురైన సంఘటన పై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన వినోద్ సోనావత్ (50) కాచిగూడ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగు దొంగిలించారు. బ్యాగులో 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు, ఖరీదైన బట్టలు ఉన్నట్లు తెలిపారు. గురువారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

◆ **మరో ఘటనలో...**

మలక్‌పేట ప్రాంతానికి చెందిన సురేంద్ర కుమార్ (28) రైల్వేలో సీసీ టీసీగా పనిచేస్తున్నాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో కామారెడ్డి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రికార్డింగ్ ఫైల్స్, ఆధార్‌కార్డులు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న బ్యాగును దొంగిలించారు. గురువారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

చోరీలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్టు

చిక్కడపల్లి: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఐదుగురిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అందులో ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. విలేకరుల సమావేశంలో పోలీసులు వివరాలను వెల్లడించారు. బాగ్‌లింగంపల్లిలో మెకానిక్ షాప్ నిర్వహిస్తున్న పి.నాగరాజు వద్దకు గుర్తుతెలియని వ్యక్తి ఒకరు వచ్చి మాటల్లో దింపి కష్టమర్‌కు చెందిన పల్సర్ బైక్‌ను చోరీ చేసి ఉడాయించాడు. బాధితుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి క్రైమ్‌పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో వాహనాల తనిఖీ సందర్భంగా చోరీ చేసిన రెండు వాహనాలను అమ్మేందుకు రామ్‌నగర్‌లోని ఆమీర్ నివాసానికి వెళ్లే క్రమంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. మొత్తం 11 కేసుల్లో వారిని నిందితులుగా గుర్తించారు. ఈ సందర్భంగా మిద్దెల ఏడుకొండలు(18), మహ్మద్ ఆమీర్(35)లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. అందులో ముగ్గురు మైనర్లు ఉండటంతో వారిని జువైనల్ హోమ్‌కు పంపించారు. చోరీ చేసిన వాహనాలను ఎక్కువ ధరకు అమ్ముకునే మహ్మద్ ఇజాజ్ అహ్మద్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులను చాకచాక్యంగా అదుపులోకి తీసుకున్న క్రైమ్ పోలీసులను ఏసీపీ అభినందించారు.

రాష్ట్ర బంద్‌కు అందరూ సహకరించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ రిజర్వేషన్లు అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా మారాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ వ్యవస్థలు బీసీలకు అనుకూలంగా మారాలని వారిపై ఒత్తిడి తీసుకురావడానికి ఒక పెద్ద ప్రజా ఉద్యమాన్ని అక్టోబర్ 18న తీసుకొచ్చామని అన్నారు. ఈ బంద్‌కు సబ్బండవర్గాల నుంచి మద్దతు లభిస్తున్నందున విద్యాసంస్థలు, పాఠశాలలు, కార్పొరేట్ కంపెనీలు సహకరించాలని కోరారు. లేని పక్షంలో బలవంతంగా బంద్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్లపై తలపెట్టిన బంద్‌కు మద్దతుగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్ బీసీ భవన్ నుంచి గన్‌పార్క్ వరకు భారీ ఎత్తున కార్ల ర్యాలీని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు ఆమోదం తెలుపుతున్నా కోర్టు కేసులు ద్వారా మళ్లీ మొదటికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధికంగా ఉన్న బీసీ జనాభా అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని తెలిపారు. ఇప్పటికే బీసీ విద్యార్థుల పట్ల స్కాలర్‌షిప్‌లు, లోన్‌ల విషయంలో బీసీలను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. దీన్ని వల్ల బీసీలకు సరైన గుర్తింపు రావాలంటే పెద్ద ఎత్తున పోరాటం చేయకపోతే అది సాధ్యం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జా సత్యం, టి.రాజ్‌కుమార్, రాజునేత, నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, చెరుకు మణికంఠ, అశిష్, రాందేవ్, నిఖిల్, అనురాధ, పద్మ, శివకుమార్‌గౌడ్, నరేష్, శివ, లీలా తదితరులు పాల్గొన్నారు.



బంద్ విజయవంతం చేయాలని నిర్వహించిన ర్యాలీలో ఆర్.కృష్ణయ్య తదితరులు

తెలంగాణ బంద్‌కు గంగపుత్ర సంఘం మద్దతు

చిక్కడపల్లి: బీసీ టీజేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు తెలంగాణ గంగపుత్ర సంఘం పూర్తి మద్దతు ఇస్తోందని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిషర్మన్, తెలంగాణ గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పాక రవిప్రసాద్ అన్నారు. గురువారం ఆయన గాంధీనగర్‌లో మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్నారు. బీసీలందరూ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు ఉద్యమిద్దాం



ముషీరాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న టీజేఎస్ నేతలు

కవాడిగూడ: స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ సమాజమంతా మరోసారి తెలంగాణ ఉద్యమం తరహాలో ఉద్యమించాలని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ టీజేఎస్ ప్రతినిధి బృందం ముషీరాబాద్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు అంగీకారం తెలిపినందున కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ యాదవ్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జయపాల్ రెడ్డి నాయకులు శంకర్, నారాయణ, దాసు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌లో భాగస్వాములం అవుతాం: టీఎమ్మార్పీఎస్



ముషీరాబాద్: బీసీల 42 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో పెట్టాలని ఈనెల 18న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నామని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంద్‌లో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. అందరూ బీసీ అస్తిత్వం, రిజర్వేషన్ల సాధనలో తోడ్పాటును ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరిగడ్డి చందు, గుమిడెల్లి తిరుమల్లేష్, జన్నారపు జీవన్, ధర్మారపు శ్రీకాంత్, ఎల్.నాగరాజు, కానుగంటి సురేష్, శ్రీకాంత్, కిరణ్, రఘు, కొండ్ర కార్తీక్, మని పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత బహుజన పార్టీ నేతలు

కవాడిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ అయ్యిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేసి బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో బీసీ సమాజాన్ని మోసం చేస్తోందని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ సుప్రీంకోర్టు డిస్మిస్ చేయడం తెలంగాణ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల ఉద్యమానికి బీసీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహాచారి, గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, విద్యార్థి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ గణేష్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలని కాగడాల ప్రదర్శన

కాచిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన జరిగే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని గురువారం రాత్రి భవన్స్ కాలేజ్ చౌరస్తా నుంచి నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా వరకు కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర బంద్‌కు అన్ని పార్టీలు పూర్తి మద్దతు ఇచ్చాయని అన్నారు. బంద్‌ను పూర్తి స్థాయిలో విజయవంతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగే విధంగా బీసీల ఐక్యతను చాటాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు నీల వెంకటేష్, తంగెళ్ల మూడి నందగోపాల్, ఉదయ్ నేత, రామకోటి, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలో కాగడాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య